మనం అమరావతి

సోమవారం | 1 | జనవరి | 2018 | పేజీలు : 8

ప్రగతి బాటలో ప్రథమస్థానం

- టూరిజానికి ప్రాధాన్యం
- జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం



(మనం న్యూస్ ప్రతినిధి, విజయవాడ): అన్ని రంగాల్లో కృష్ణాజిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ బి. లక్ష్మీకాంతం తెలిపారు. ఆదివారం విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017సం.లో వివిధ రంగాల్లో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో మిగతా 2లో...



నయా జోష్

2017ను కాలగర్భంలో కలిపేస్తూ కొత్త సంవత్సరం 2018కి స్వాగతం పలుకుతూ కేరింతలతో స్వీట్లు పంచుకుంటూ.. అరమోడ్పు కన్నులతో గ్లాసులు కలుపుకుంటూ, పరస్పరం హ్యాపీ న్యూ ఇయర్ చెప్పకుంటూ యువతీ యువకులు, ఆపై వయసువారు అర్ధరాత్రి పన్నెండు గంటలు కాగానే ఉల్లాసంలో, ఉత్సాహంలో తేలియాడారు. ఇళ్లల్లో, పబ్బుల్లో, క్లబ్బుల్లో, రోడ్లపైన, వీధుల్లోనూ నూతనోత్తేజంతో అంబరాన్ని తాకేలా ఉద్వేగభరితంగా చిందులేశారు. పాటలతో, డ్యాన్సులతో, మైమరచిపోయారు. పల్లెల్లో, పట్నాల్లో, నగరాల్లో పాతకు పాతరగా, కొత్తకు జాతరగా సాక్షాత్కరించిన సన్నివేశమిది.

మరోవంక.. ఇవేవీ పట్టనట్టు రోజువారీగా ఉండే రేపటి గురించిన చింతతో బడుగు జీవుల ఆవాసాలు పొద్దుగూకిన కొద్దిసేపటికే చలిపులి బారిన పడకుండా ముడుచుకుపోయి నిశ్శబ్దంగా నిద్రలోకి జారుకున్నాయి. రెండు విభిన్న దృశ్యాలను అర్ధరాత్రి ఆవిష్కరించే కొత్త సంవత్సరం 2018 ఈ సారైనా అందరినీ సంతోషపరిచి, ఆనందాన్ని పంచాలని ఆశిద్దాం..!

ప్రకృతి వ్యవసాయానికి
చిరునామా ఏపీ

- దీనితో ఖర్చులు తక్కువ దిగుబడులు ఎక్కువ
- సేంద్రీయ ఆహారంతో ఆయుష్షు పెంపు
- ప్రకృతి సేద్య సంవత్సరంగా 2018 నామకరణం
- ప్రతిఒక్కరూ పాలేకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి
- ఇకపై సేంద్రీయ ఆహారోత్పత్తులనే తింటా
- 'ప్రకృతి' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం
- పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

8లో..



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ముందస్తు ఎన్నికలకు
పరుగులు

- పావులు కదుపుతున్న పార్టీలు

జ్ఞాపకాలు 2017



గుంటూరు, డిసెంబరు30, మనం ప్రతినిధి: ప్రధాన రాజకీయ పార్టీల్లో ముందస్తు ఎన్నికల వాతావరణం కనిపిస్తుంది. విజయమే లక్ష్యంగా ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నాయి. అభివృద్ధి సంక్షేమమే అధికార పార్టీ లక్ష్యం. మిగతా 2లో...

ప్రగతి బాటలో ప్రథమస్థానం

(మొదటిపేజీ తరువాయి)

ఉందని చెప్పారు. వృద్ధిరేటు భారీగా పెరిగిందన్నారు. 2017సంవత్సరానికి సంబంధించి జాతీయ వృద్ధి రేటు పెరుగుదల సగటు 5.6శాతం ఉండగా.. రాష్ట్ర వృద్ధిరేటు 11.2ఉందని చెప్పారు. అయితే జిల్లా వృద్ధిరేటు 19.8శాతం గా నమోదైందని.. దానిని 20శాతానికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన వెల్లడించారు. 2011 నుంచి జిల్లా ప్రగతి పథంలో నడుస్తోందన్నారు. జీడీడీపీ రూ. 85వేల కోట్లు, జీవీఏ రూ. 79వేల కోట్లుగా ఉందని చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరంలో జీవీఏ రూ. 15వేల కోట్లు పెరిగిందని వివరించారు. గత సంవత్సరం తలసరి ఆదాయం రూ. లక్షా 21వేల కోట్లు ఉండగా.. నేడది రూ. 30 వేల కోట్లకు పెరిగి రూ. లక్షా 61వేలుగా అయిందన్నారు. ప్రాథమిక రంగంలో పెరుగుదల బాగా ఉందని చెప్పారు. మత్స్యశాఖ, ఫిషింగ్ లో రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉన్నామని తెలిపారు. ఖరీఫ్ సీజన్ లో మొత్తం 2.37 హెక్టార్లలో వరి పంటను వేశామని, ఎకరాకు సరాసరి 33 బస్తాల పంట దిగుబడి సాధించామని చెప్పారు. గతంలో ఇది 28 బస్తాలుగా ఉండేదన్నారు. పరిశ్రమల వృద్ధిరేటు కూడా డబుల్ డిజిట్ కు చేరుకుందన్నారు. ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలను జిల్లాలో స్థాపింపచేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఫార్మసి, ఐటీ రంగాల పై దృష్టిపెట్టామన్నారు.

జిల్లాను టూరిజం హబ్ గా చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ వెల్లడించారు. భవానీద్వీపంతోపాటు మరో ఆరు ద్వీపాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధపరుస్తున్నామన్నారు. విజయవాడలో ఉన్న పర్యాటక ప్రాంతాలను, మచిలీపట్నం, కొల్లేరు, నాగాయలంక తదితర ప్రాంతాల్లో టూరిజం కార్యక్రమాలు చేపడుతామన్నారు. విజయవాడను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. రోడ్ల చుట్టూ గ్రీనరి ని అభివృద్ధి చేశామని తెలిపారు. అలాగే జిల్లాలో అంగన్ వాడీ కేంద్రాలను ఏడుస్టార్ల రేటింగ్ తో అభివృద్ధి పరుస్తున్నామని పేర్కొన్నారు.

జనవరి2 నుండి 11 వరకు జన్మభూమి మా ఊరు గ్రామ సభలు

కర్లపాలెం డిశంబర్ 31మనం న్యూస్: మండలం లోని 20 గ్రామ పంచాయతిలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐదో విడత జన్మభూమి మా ఊరు గ్రామ సభలు జరుగుతాయని కర్లపాలెం యం.పి.డి.ఒ పులి శరత్ బాబు తెలిపారు.ఈ విధంగా 2వ తేదిన నాగ రాజు పాలెం, తుమ్మలపల్లి 3న దమ్మనవారిపాలెం,పేరలిపాడు 4న దుంది వారిపాలెం,పెదగొల్లపాలెం 5న పేరలి,బొలాయపాలెం 6న యాజలి, పెదపులుగువారిపాలెం 7న బెద్దాం,నర్రావారిపాలెం 8న గణపవరం, కొత్తనందాయపాలెం 9న చింతా యపాలెం,యేట్రవారి పాలెం 10 న పాతనందాయపాలెం,నల్లమోతువా రిపాలెం 11న సమ్మె టవారిపాలెం గ్రామపంచయతిలలో జరిగే సభల్లో మండల స్థాయిఅధికారులు, స్థానిక అధికారులు , సర్పంచ్‌లు, యం.పి.టి.సి సభ్యులు, జన్మభూమి సభ్యులు ప్రజా ప్రతినిధులు పాల్గోని ప్రజల సమస్యలపై చర్చిస్తారని కావున ఆయా పంచాయతీల ప్రజలు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మతగురువు హత్యను ఖండించిన ముస్లీం సంక్షేమ సంఘం

వినుకొండ, డిసెంబర్ 31, మనం న్యూస్ : మతగురువు హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముస్లీం సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఖండించారు. రాజమండ్రి బత్తినగర్‌లోని మసీదులో మత గురువు మహమ్మద్ ఫరూక్‌ను హత్య చేయటం దారుణమని ముస్లీం సంక్షేమ సంగం నియోజకవర్గ అధ్యక్షుడు పి.ఎస్.ఖాన్ అన్నారు. సంఘ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ మత గురువు హత్యతో పాటు ముస్లీంల పవిత్ర గ్రంథం ఖురాన్‌ను తగలబెట్టడం అమానుషం అన్నారు. ఇలాంటి సంఘటనలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ కాంట్రాక్టర్ గౌస్‌బాషా, ఎం.ఎస్.కె.బాషా, సిహెచ్. సుభాని, ఎం. మస్తాన్‌వలి, యాసీన్, జమీల్, ఎం. ఖాజీబేక్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఎన్నికలకు పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రజా వ్యతిరేక విధానాలపై వైసీపీ ప్రజల్లోకి వెళుతుంది. మరోవైపు ప్రధాన రాజకీయ విపక్షాలైన టీడీపీ, వైసీపీల్లో పైకి ఐక్యత కనిపిస్తున్నా గ్రూపు రాజకీయాలు సాగుతున్నాయి. ఒక వర్గంపై మరో వర్గం పట్టు సాధించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. మరోవైపు ప్రధాన రాజకీయ పార్టీల్లో రాజకీయ పక్షాలు తమ పార్టీ నాయకుల బలాబలాలపై నిత్యం సర్వేలు నిర్వహిస్తూ వాటి ఆధారంగానే వచ్చే ఎన్నికల్లో టికెట్లు కేటాయించనున్నట్లు ప్రకటించాయి. దాంతో రెండు పార్టీల నేతల్లో పరీక్షకాలంగా మారింది. సర్వేల ఆధారంగా తమ రాజకీయ భవిష్యత్ ముడిపడి ఉండటంతో నేతలు అంతర్మధనంలో ఉన్నారు. మరోవైపు విపక్షాలు అధికార పక్షాన్ని ఎదుర్కోవడంలో విఫలమైంది. అధికార పార్టీ ఇంటింటికీ తెలుగుదేశం, ప్రతిపక్ష పార్టీ గడపగడపకు వైసీపీ కార్యక్రమాలు నిర్వహిస్తూ బలపడటానికి ముందుకు సాగుతున్నాయి. ఈపోరుబాటలో విజయం ఎవరి తథ్యమో ప్రజలే నిర్ణయించాలి. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజలకు చేరువయ్యేందుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాయి. అధికార పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను తమ కార్యకర్తల ద్వారా ప్రచారం నిర్వహిస్తుంటే ప్రతిపక్షం మాత్రం అధికార పార్టీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ పాదయాత్ర పేరిట రాష్ట్రమంతా పయనిస్తుంది. ఇదిలా ఉంటే అధికార పార్టీ ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని చేపట్టి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరించే పనిలో పడితే... ప్రతిపక్షం మాత్రం గడపగడపకు వైసీపీ కార్యక్రమం నిర్వహిస్తూ... అధికార పార్టీ వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేస్తూ ముందుకెళ్తుంది. ముందస్తు ఎన్నికలు నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఓటరు దేవుళ్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యాయి. అయితే తెలుగుదేశం పార్టీ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతుంటే వైసీపీ మాత్రం తమ వ్యూహాలతో ముందుకు సాగుతుంది. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు తాము చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు ప్రజల్లోకి ఏవిధంగా తీసుకెళ్తున్నారో నిశితంగా గమనిస్తున్నారు.

టీడీపీలోకి వారసులొస్తున్నారు..

టీడీపీ కొత్తతరం నేతలకు ఆహ్వానం పలికేందుకు సిద్ధమవుతోంది. సాధారణ ఎన్నికలకు మరో సంవత్సరంన్నర సమయం ఉంది. అయితే ఇప్పుడే రాజకీయాలు వేడెక్కాయి. ఆంధ్రప్రదేశ్‌లో అయితే రాజకీయ వారసులు తెరపైకి వస్తున్నారు. శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుమారుడు శివరాంప్రసాద్ కూడా శాసనసభలో అడుగుపెట్టాలని ఉవ్విళ్లూరుతున్నాడు. అలానే నరసరావుపేట ఎంపీ రాయపాటి సాంబశివరావు తనయుడు రాయపాటి రంగబాబు కూడా రాజకీయాల్లోకి రంగ ప్రవేశం చేయనున్నారు. ఇదేవిధంగా కొంత మంది సీనియర్ నాయకులు తమ వారసులను రాజకీయాల్లోకి తెచ్చేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. కొంతమంది నేతలైతే మహిళా రిజర్వేషన్ ఏర్పడిన చోట తమకు వ్యతిరేక పవనాలు ఉన్నచోట తమ భార్యను రంగంలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. ఏదిఏమైనప్పటికీ తమ ఇంట రాజకీయమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

పుష్పాత్మకంగా వ్యవహరిస్తున్న వైసీపీ..

గత ఎన్నికల్లో పుష్పాత్మకంగా వ్యవహరించకపోవడంతో వైసీపీ ఓటమి చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల నంద్యాల ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొనడంతో కొంత మేర మార్పులు చేర్పులు చేస్తున్నట్లు సమాచారం . ఇటీవల పార్లమెంటు నియోజక వర్గ జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి అధ్యక్షులను నియమించింది. అయితే పూర్తి స్థాయిలో ఈకమిటీలను ఏర్పాటు చేయలేదు. జిల్లాలో వైసీపీ నాయకత్వ లోపం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. గత ఎన్నికల్లో అధికార పార్టీ ఎక్కువ స్థానాలను కైవసం చేసుకోవడం జిల్లాలో స్పీకర్, మంత్రులు బలంగా ఉండటంతో వైసీపీ నాయకత్వం నీరసంగా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లకపోవడంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి సీనియర్ నాయకులపై సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. అందువల్లే ఇటీవల కాలంలో కొన్ని మార్పులు చేర్పులు చేసి కొత్తవారికి చోటు కల్పించేందుకు పుష్పాత్మకంగా ముందుకు సాగుతుంది.

కొత్త ఏడాదిపై కోటిఆశలు

- **నూతన సంవత్సరంలో అభివృద్ధే కీలకం**

బాపట్ల డిసెంబరు 31 (మనంన్యూస్ ప్రతినిధి): కోటిఆశలతో కొత్త ఏడాదిని బాపట్ల నియోజకవర్గం ఆహ్వానిస్తోంది. నూతన సంవత్సరంలో పట్టణం,బాపట్ల కర్లపాలెం, పి.విపాలెం మండలాలు ప్రగతి పథంలో పయనించాలని ప్రజలు కోరుకుంటూన్నారు గుంటూరు జిల్లా ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తెదేపా బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా తీవ్రంగా కృషిచేసి 20162017లో మొత్తం రూ.211 కోట్లతో అభివృద్ధి పనులుచేశారు. ఈ కొత్తఏడాదిలో పట్టణంలో 54 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తారు. నియోజకవర్గంలో 590 కోట్లతో కొన్ని పనులుచేసట్టారు మరికొన్ని నూతన ఏడాదిలో చేస్తారు. ఇందులో రూ. 20 కోట్లతో యస్.సి. ,యస్.టి. ఉపప్రణాళిక క్రింద పట్టణంలో సి.సి.రోడ్లు మురుగుకాలువలు, పైపులేన్లు ,పార్కుల అభివృద్ధి చేస్తారు. మున్సిపల్ ఉన్నత పాఠశాల నూతన తరగతి గదులు నిర్మాణానికి 2.50 కోట్లు క్రీడావికాశభవనానికి 2 కోట్లు, స్మశాన వాటికల అభివృద్ధికి 4.20 కోట్లతో 24 స్మశానవాటికల పనులు చేపట్టారు. డంపింగ్ యార్డు అభివృద్ధికి 1.43 లక్షలు మంజూరయ్యాయి. సమగ్ర మౌళిక వసతుల కల్పనకు 13.85 కోట్ల నూతనపార్కుల అభివృద్ధికి 1.45 కోట్లు నారాచంద్రబాబునాయుడు కళాక్షేత్ర ఆదునీకరణకు రూ. 30 లక్షలు షాదీఖాన అభివృద్ధికి 50 లక్షలు, రైతు బజారు నిర్మాణానికి 40 లక్షలు పెడతాను నియోజకవర్గంలో పంచాయితీరాజ్ మంచి నీటి పథకాలను భవన నిర్మాణానికి 150 కోట్లు కేటాయించారు. కొన్ని పనులు జరుగుతున్నాయి. సూర్యలంకా పర్యాటక



గడియారస్తంభం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.6కోట్లు, పండు గప్పల, పీతల హ్యాచరీకి రూ. 2 కోట్లు ,మార్కెట్ యార్డులో గిడ్డంగుల నిర్మాణానికి 3 కోట్లతో చేపట్టుభోయిన పనులు పూర్తి కావస్తున్నాయి.

ఇవి కాకా నల్లమడ ముంపు నివారణకోసం ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు రూ. 3.68 కోట్ల బాపట్ల,కర్లపాలెం, పి.వి.పాలెం మండలాల్లో జాతీయ విపత్తుల నిర్మాణం క్రింద రూ. 100 కోట, తుఫాను రక్షిత భవనాలు, రహదారుల నిర్మాణం చేస్తారు. ఇందులో సూర్యలంక తీరంలో 3 కోట్లతో సామూహిక తుఫాను రక్షిత భవనాలు నిర్మించారు. పి.విపాలెం మండలం కేంద్రం నుండి బాపట్ల మండలం స్టువార్టుపురం వరకు 216 జాతీయ రహదారి నిర్మాణ పనులు రూ. 3వేల కోట్లతో చేపడతారు.ఇందులో భాగంగా నందిరాజుతోట గ్రామ సివారు నుండి పిన్నిబోయినవారిపాలెం మీదుగా వెదుళ్లపల్లి వరకు బైపాస్ రోడ్ నిర్మిస్తారు. కొమ్మమూరి కెనాల్ ఆదునీకరణ కోసం రూ. 150 లతో పనులు చేపట్టారు. 2018 మర్చి నాటికి పనులు పూర్తి చేస్తారు. 2017 లో డిసెంబర్‌లో 20 లక్షలతో నిర్మించిన నూతన గడియారస్థంబాన్ని ప్రారంభించారు. రూ. 8 కోట్లతో నిర్మించిన బాపట్ల సూర్యలంక 2లైన్ల రోడ్డును ప్రారంభించారు. 8 కోట్లతో నిర్మించిన సాంఘీక సంక్షేమ శాఖ అస్టల్ భవనాలను ప్రారంభించారు. 1.30 లక్షలతో నూతనంగా నిర్మించిన మార్కెట్ భవనాలు నిర్మించారు, ప్రారంభించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింల నిరసన ప్రదర్శన

బాపట్ల టౌన్ డిసెంబరు 31 మనం న్యూస్ ః రాజమహేంద్రవరం, బిత్తిననగర్ (లాలాచెరువు) నురాని మసీదు మౌజన్ మహ్మద్ ఫరూక్‌ను హతమార్చి ముస్లింల పవిత్రగ్రంధాన్ని తగులబెట్టి మసీదు ధ్వంసం చేసిన నిందితులను వెంటనే ఆరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని, ది అంజుమన్‌ఏ ఇస్లామీయా కమిటీ నాయకులు షేక్ జిలాని అన్నారు. ముస్లిం మనోభావాలను తీవ్రంగా గాయపరిచిన నిందితులను శిక్షించేవరకు ముస్లింలు దశలవారిగా ఆందోళనకార్యక్రమాలు చేపడతామన్నారు. ఆదివారం కమిటి ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అంజుమన్‌ఏ కమిటి అధ్యక్షులు షేక్ జిలాని, ఉపాధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, కార్యదర్శి షేక్ సలీమ్, సంయుక్త కార్యదర్శి ఫరీద్‌మస్తాన్,మెంబర్లు రఫీ,బాజీ, రషీద్,కరీముల్లా,కోఅప్షన్ మెంబరు వాసిమ్,మతపెద్దలు పట్టణంలోని అన్ని మసీదుల ముతవల్లీలు అధ్యక్షులు, కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

బాపట్ల రూరల్, డిసెంబరు 31 మనంన్యూస్ : శ్రీ శ్రీనివాస సేవాసమితి,శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని, జిల్లా అంధత్వనివారణసంస్థ సహకారముతో ఆదివారం బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తోట మల్లీశ్వరి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ అన్నదానం ఒకరిద్దరి ఆకలి తీరుస్తుంది. నేత్రదానం మరోకరికి జీవితాంతం చూపునిస్తుంది అన్నారు. ప్రతిఒక్కరు ఆరునెలకు ఒక్కసారి కంటి పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. నేత్రదానం చేయలన్నారు.శ్రీ శ్రీనివాస సేవాసమితి అధ్యక్షుడు పి. లక్ష్మీనరసరాజు మాట్లాడుతూ సమితి ఆర్ధిక సహాయంతో ఇప్పటివరకు బాపట్ల పట్టణం,మండల కర్లపాలెం,పి.వి.పాలెం మండలల్లో 16 ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి 2,800ల మందికి కంటి శుక్లాల ఆపరేషనులు చేయించామన్నారు. మున్సిపల్ కమిషనర్ తుమ్మల వెంకట క్రిష్ణయ్య మాట్లాడుతూ లక్ష్మీనరసరాజు పేదప్రజలకు ఉచితంగా అందిస్తున్న సేవలను కొనిఆడారు.శిబిరంలో డాకర్లు శ్యామ్,అనుష, క్యాప్ ఎడ్మినిస్టేటర్ శ్రీనివాస్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ లేళ్ళ రాంబాబు, మున్సిపల్ కౌన్సిలర్ సి.హెచ్. వెంకటేశ్వరరావు, బొమ్మనబోయిన సాంబయ్య, మున్సిపల్ హైస్కూల్ హెడ్‌మాస్టార్ ఆదిశేషరెడ్డి, యన్.సి.సి. ఆఫిసర్ కత్తి శ్రీనివాసరావు, తోటనారాయణ, రిటైర్డు ప్రిన్సిపల్ డబ్ల్యు.జి.కె. మూర్తి కె.జగన్, యన్.సి.సి. క్యాడెట్లులు, శంకర కంటి ఆసుపత్రి డాకర్లు సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం 480 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 290 మందిని శుక్లాల ఆపరేషన్‌కు అర్హులుగా గుర్తించారు.



కంటి పరీక్షలు ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ తోట మల్లీశ్వరి

ఆర్యవైశ సంఘం నూతన కమిటీ ఎన్నిక

పెదకూరపాడు, డిసెంబర్ 31, మనం న్యూస్: మండల కేంద్రమైన పెదకూరపాడులో ఆర్యవైశ్య సంఘం సమావేశం పాటిబండ్ల గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పెదూరపాడు మండలం అధ్యక్షులు సెక్రటరీగా పాటిబండ్ల గ్రామానికి చెందిన కాకర్ల శివప్రసాద్, జిల్లా కౌన్సిలర్‌గా కొప్పు సాంబశివరావు, కొప్పురావూరి వెంకట నరసింహారావు, జలాల్ పురం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు, గార్లపాటి పూర్ణచంద్రరావు, మండల కౌన్సిలర్ గా పాటిబండ్ల గ్రామానికి, కాకర్ల నాగేశ్వరరావు, కాకర్ల ఆదిశంకరావు, ముస్సాపురం గ్రామానికి చెందిన పసుమర్తి సాంబశివరావు, కొప్పురావూరి వెంకట సాంబశివరావు, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు.



ఏడువేల ఇండ్లకు రంగం సిద్ధం

యం.యల్.ఎ. నరేంద్ర



చెక్కులు పంపిణీ చేస్తున్న యం.యల్.ఎ. నరేంద్రకుమార్

పొన్నూరు డిసెంబర్ 31 మనం న్యూస్ : పేద బడుగు వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న తెలుగుదేశం ప్రభుత్వం నూతన సంవత్సరం 2018లో మరిన్ని సంక్షేమ పథకాలను దరిచేర్చేందుకు కృషిచేస్తోందని పొన్నూరు శాసన సభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజక వర్గం పరిధిలోని పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాణి మండలాలకు చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్దిదారులకు రూ. 15.30లక్షల నగదు చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఈ నియోజక వర్గంలో కొత్తగా ఏడు వేల మందికి ఇండ్ల స్థలాలను మంజూరుచేసి ఇండ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నియోజక వర్గంలో రూ. 125 కోట్లతో ఆర్. బి. రోడ్ల అభివృద్ధి, రూ. 102 కోట్లతో గ్రామీణ రోడ్ల నిర్మాణ పనులు పూర్తిచేశామన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతనిచ్చి కోట్లాది రూపాయలతో వెచ్చించి తగు సదుపాయాలు కల్పించామన్నారు. గత ప్రభుత్వాలు వీటితోపాటు మౌలిక సదుపాయాలు అందించటంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశాయన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమే ప్రజలకు అండగా నిలిచి అనేక సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు. వాస్తవాలు ఇలావుంటే ప్రతిపక్షాలు అర్థం పర్థంలేని ఆరోపణలతో విమర్శలు గుప్పించటమే పనిగా పెట్టుకున్నాయన్నారు. గుడిపూడి జంగాల సామెతగా నలుగురు నాయకులు ఒకచోట జేరి ఏవేవో అనవసరమైన చర్చలు జరుపుతూ కాలంగడుపుతున్నారన్నారు. ఇటీవల జరిగిన వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు శాప్ నిధులు ఎంత వచ్చిందో కూడా తెలియకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం వారి కుటిల స్వభావాన్ని చాటిచెపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సజ్జా హేమలత, మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ నన్నపనేని ప్రభాకరరావు, బొర్రు రామారావు, మాదల వెంకటేశ్వరరావు, ఆకుల సాంబశివరావు, పిన్నమనేని కోటేశ్వరరావు, యరసాని శ్రీరామమూర్తి, షేక్ బాజీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు, డిసెంబరు 31, మనం న్యూస్ ః నూతన గుంటూరు టౌన్ కాంపౌండర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆదివారం సీతానగరం 2వ లైను మెడికల్ రిప్రజెంటేటివ్ హాలులో తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితానికి ప్రాణం పోసేది డాక్టర్లు అయితే ఆ తర్వాత ప్రాణాన్ని నిలబెట్టేవాళ్లు కాంపౌండర్లు అని అన్నారు. రానున్న కాలంలో అసోసియేషన్‌కు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమాన్ని గణేశ్ ల్యాబ్ అండ్ ఎక్స్‌రే సౌజన్యంతో ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సంఘ సభ్యులు వి.సాంబశివరావు, వి.శ్రీనివాసరావు, లక్ష్మాచారి, ఆంజనేయులు, నాగరాజు, ప్రభాకరరావు, ఎల్.వి వెంకట్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నగదురహితం ఎక్కడ?

కనిపించని నగదురహిత లావాదేవీలు • రేషన్‌షాపుల్లోనూ నగదు చెల్లిస్తున్న లబ్ధిదారులు • ఆర్భాటంగా ప్రచారం.. ఆచరణ శూన్యం • ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం • నగదురహిత లావాదేవీలు కనుమరుగు

పెదకూరపాడు, డిసెంబర్ 31, మనం ప్రతినిధి: పెద్ద నోట్ల రద్దు అనంతరం కేంద్ర, రాష్ట్ర మొగ్గ చూసే విధంగా తీసుకున్న చర్యలు సత్ఫ లితాలను ఇవ్వడం లేదు. నియోజకవర్గంలో దాదాపు నగదు రహిత లావాదేవీలు ఎక్కడ కనిపించడం లేదు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు చేయడంతో వాటి స్థానంలో 2 వేల నోట్లు 5 వందల నోట్లను ప్రవేశపెట్టింది. ఆనాటి నగదు రహిత లావా దేవీల కోసమే వ్యాపారాలు, దుకాణ దారులు తప్పని సరిగా స్వైపింగ్ మిషన్ ఏర్పాటు చేయాలని విస్తృతంగా ప్రచారం చేశారు. దీని వలన చిల్లర సమస్యలు తగ్గుతుందని , దొంగ నోట్లు సమస్య కూడా ఉండదని అధికారులు ఆర్భాటంగా ప్రచారం చేశారు. అలాగే నగదురహిత లావా దేవీలు జరిపిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహాలను కూడా అందిస్తుందని పేర్కొన్నారు. ఈ నేపద్యంలో రేషన్ షాపుల్లో అయితే బహుమతులు తీసుకున్న వారు సైతం ప్రస్తుతం నగదు రహిత లావాదేవీలు జరపక పోవడం విశేషం.

స్వైపింగ్ మిషన్ కొరత

వ్యాపార సంస్థలు, దుకాణాల్లో నగదు రహిత లావాదేవీలు జరపాలంటే ఖచ్చితంగా స్వైపింగ్ మిషన్లు పంపిణీ చేయాలి. దీంతో చాల మంది వ్యాపారులు మిషన్లు కోసం ధరఖాస్తు చేసుకున్న వారికి మాత్రం ఆ మిషన్లు అందలేదు. దీంతో వారు కూడా ఆ తర్వాత వాటిపై ఆసక్తి చూపలేదు. నియోజక వర్గంలో పెట్రోలు బంక్‌ల యాజమానులు కొంత మేరకు మాత్రమే నగదురహిత లావా దేవీలు నడుపుతున్న ఎక్కవగా నగదు వ్యాపరమే కొనసాగిస్తున్నారు.

రేషన్ షాపుల్లోనూ నగదు

ప్రభుత్వం ఆధీనంలో నడిపే రేషన్ షాపుల్లో నగదు రహిత లావా దేవీలు జరపాలని ప్రభుత్వాధికారులు ఆదేశాలు ఇచ్చారు.ఇందుకోసం బ్యాంక్ ఖాతా ఉన్న లబ్ధిదారులు తమ ఆధార్ లింగ్ చేసుకోవాలని సూచించారు. చాలా మంది తమ ఆధార్ కార్డులు అనుసందానం కూడా చేసుకున్నారు. అయితే ప్రస్తుతం మాత్రం రేషన్ షాపుల్లో నగదు చెల్లించే లబ్ధిదారులంతా సరుకులకు తీసుకెళ్తున్నారు.

ఎప్పుడు ఏమి చేస్తారో ఏ పథకం మధ్యలో ఆపివేస్తారో తెలియదు



షేక్ జానీ, పెదకూరపాడు

ప్రచారం ఆర్భాటంగా చేసి నగదు రహిత లావాదేవీలు జరపాలని తెలిపారు. మధ్యంతరంగా పట్టించు కోలేదు. ఎప్పుడు ఏమీ చేస్తారో ఏ పథకం ఎప్పుడు ఆగి పోతుందోఅయోమయంలో ప్రజలు ఉన్నారు. ఈ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందాలంటే నగదు రహితం కనపరచాలని ప్రచారం చేశారు. ఇప్పుడు అర్ధాంతరంగా ఆగిపోయింది.

ప్రతి కుటుంబంలో ఆనందాలు వెల్లివిరియాలి

వైసిపి నేత డాక్టర్ జగన్‌మోహనరావు



నందిగామ, డిసెంబర్ 31, మనంన్యూస్ : 2018 నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని వైఎస్ఆర్ సిపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎబిసి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని చందాపురం గ్రామంలో 300ల మందికి ఆదివారం ట్రస్ట్ అధ్యక్షులు చిరుమామిళ్ళ అశోక్‌బాబుతో కలిసి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలోని చేదు, తీపి జ్ఞాపకాలను మరిచిపోయి రానున్న నూతన ఏడాది నూతనోత్సాహంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేయడం అభినందనీయమని, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని అన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు మాట్లాడుతున్న తన సంపాదనలో 25 శాతం గ్రామాభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోవెలమూడి ప్రమీల, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోవెలమూడి వెంకటనారాయణ, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు నెలకుదిటి శివనాగేశ్వరరావు, కత్తురోజు శ్రీనివాసాచారి, జిల్లా కార్యదర్శి మంగునూరి కొండారెడ్డి, ఫ్లోర్‌లీడర్ మహ్మద్‌మస్తాన్, గ్రామ కన్వీనర్ చిరుమామిళ్ళ భుజంగరావు, సర్పంచ్ గుమ్మా సుశీల, ఎంపిటిసి యద్దనపూడి వెంకట్రావమ్మ, రాష్ట్ర యూత్ సంయుక్త కార్యదర్శి కొండా కృష్ణారెడ్డి, రైతు కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, యార్లగడ్డ సత్యనారాయణప్రసాద్, రైతు విభాగం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాయల జానకి రామయ్య, కంచికచర్ల మండల కన్వీనర్ బండి జానకిరామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కాలవ వాసుదేవరావు, నందిగామ పిఎపి ఎస్ ఉపాధ్యక్షులు పాములపాటి రమేష్, పట్టణ యూత్ కన్వీనర్ మువ్వల శ్రీనివాసరావు, నాయకులు బొల్లినేని శ్రీనివాసరావు, జిల్లేపల్లి రంగారావు, చలమల మధు, తోట అంజారావు, నలమల్లి మురళి, మాజీ సర్పంచ్ మందా బాబురావు, గ్రామ నాయకులు కనకపూడి వెంకటరత్నం, చిరుమామిళ్ళ వెంకటేశ్వర్లు, కొంగర పెరుమాళ్ళయ్య, చిన్నస్వామి, వెంకటరత్నం, చిన్ని, పలువురు నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతోనే అందరికీ సంక్షేమం

ఎమ్మెల్యే కోన రఘుపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘుపతి

కర్లపాలెం, డిసెంబరు 31 మనంన్యూస్ : వై.యస్.ఆర్.సి.పి. అధినేత వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన నవరత్నాలు పథకంతోనే అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతాయని, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. ఆదివారం సాయంత్రం కర్లపాలెం మండలం, పేరలి గ్రామంలో రెండవరోజు నిర్వహించిన మన ఎమ్మెల్యే మన ఇంటికి రచ్చబండ, పల్లెనిద్ర, కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కోన రఘుపతి చురుగ్గా పాల్గొన్నారు. కాలినడకనా ప్రతిఇంటికి వెళ్ళి,జగన్ చేస్తున్న ప్రజాసంకల్ప యాత్ర గురించి వివరించటంతోపాటు నవరత్నాలు అమలుజరిగితే కలిగే ప్రయోజనాలను అందరికి వివరించారు. ప్రతి ఒక్కరిని పలకరించి సమస్యలు అడిగితెలుసుకున్నారు. అధిక శాతం మంది తమ ఫింఛన్‌లు అందటం లేదని ,రేషన్ కార్డులు ఇవ్వటంలేదని, వేలిముద్రలు పడలేదు రేషన్ ఇవ్వటం అంటూ అరకోర ఇచ్చే బియ్యంకూడా ఇవ్వటం లేదని ఫిర్యాదులు అందాయని ఎమ్మెల్యే కోన రఘుపతి విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నరాలశెట్టి ప్రకాష్, పిల్లి శేఖర్, ప్రసాదరెడ్డి, కోకి రఘువరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన తెలుగుదనం

• ఘనంగా జాతీయ సమైఖ్య నృత్యోత్సవాలు • ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు • నందిగామ చిన్నారులకు బహుమతులు

నందిగామ, డిసెంబర్ 31, మనంన్యూస్ : భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను విద్యార్థి దశ నుండే ప్రతిఒక్కరిలో ఇనుమ డింప జేయాలని, కళాకారులకు, చిన్నారులను తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని, సాంస్కృతిక ప్రదర్శనలను రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల నిర్వహించి కళల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియచేసే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని ఎబిసి ఫౌండేషన్ నిర్వాహకులు లయన్ డాక్టర్ కెవి రమణారావు, భారత్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు లయన్ లలితారావులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సంస్కృతి సమితి, ఎబిసి ఫౌండేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన నిర్వహించిన కూచిపూడి నాట్య ప్రదర్శనల్లో నందిగామకు చెందిన శ్రీనట రాజనాట్య కళామండలి చిన్నారులు మంచి ప్రతిభ కనపర్చటంతో ప్రోత్సాహక ప్రశంసాపత్రాలు, షీల్డులు అందుకున్నారు. నందిగామ పట్టణానికి చెందిన శ్రీనటరాజ నాట్య కళామండలి గురువు తోట వెంకట నిర్మల శిష్యబృందం ఆకుల నాగసాయి ప్రసన్న, బొడ్డు జాహ్నవి, కొత్తాకుల యశస్వి, దుద్దుకూరు రూపశ్రీ, యర్రం రెడ్డి శ్రీహరిత, ఆకుల ప్రజ్ఞ, బండ్ల మూడి ఉజ్వల కూచిపూడి నాట్యం చేసి ప్రేక్షకు లను అబ్బురపరిచారు. పలుకే బంగా రమాయెన అనే భక్తిగీ తానికి చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. జాతీయ సమైఖ్య నృత్యో త్సవం కార్యక్రమంలో పాల్గొన్న నాట్య కళాకారుల పేర్లను హానర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదు చేసినట్లు నిర్వాహకులు డాక్టర్ లయన్ కెవి రమణారావు, లలితారావ్‌లు తెలిపారు. నృత్య ప్రదర్శన చేసిన కళాకారులకు ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లు అందజేశారు. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ఇన్‌చార్జి బి.ఆర్. తులసీరావు, సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీతలు డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్, డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, గేయ రచయిత మరియు నడుటు శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర, హానర్ బుక్‌ఆఫ్ వరల్డ్‌రికార్డ్స్ సౌత్ ఇండియా కోఆర్డినేటర్ పల్లె శ్రీనివాసనాయుడు, సినీ నటుడు కిరణ్, పలువురు ప్రముఖులు, నాటక కళాకారులు పాల్గొని చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చిన్నారులు మరెన్నో కూచిపూడి నృత్య ప్రదర్శనల ఇస్తూ భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని, దినదినాభివృద్ధి చెంది మంచి కళాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలని చిన్నారులను ఆశ్వీరదించారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలకు అం తర్జాతీయ, దేశ వ్యాప్తంగా మంచి క్రేజ్ పెరుగుతుందని అన్నారు. కూచిపూడి నృత్యం నేర్చు కోవటానికి ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపి చిన్నారులను ప్రోత్సహిం చారు.







పేటలో ఘనంగా ఆనంద ఆదివారం

జగ్గయ్యపేట,డిసెంబర్ 31 మనంన్యూస్ : జగ్గయ్యపేట పురపాలక సంఘ ఆధ్వర్యంలో ఆనంద ఆదివా రం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బాబురావు, శాసనసభ్యు లు శ్రీరాం రాజగోపాల్, మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్, తహశీల్దా చవల నరసింహారావు, మున్సిపల్ కమీషనర్ పి.రమేష్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ యలమంచిలి రాఘవ, తదితర కౌన్సిలర్లు ప్రముఖులు పాల్గొన్నారు. అదేవిధంగా సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భం గా జాయింట్ కలెక్టర్ బాబురావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆత్మగౌరవ దీక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలని కోరారు. రెండవ తేదీ నుండి జరిగే జన్మభూమి కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శాసనసభ్యులు శ్రీరాంరాజగోపాల్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమాలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ ప్రసంగిస్తూ జగ్గయ్యపేట పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ తమవంతు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఉన్నపారిశుధ్య సమస్యల పరిష్కారంతోపాటు అంటువ్యాధులను తరిమి కొట్టేందుకు పురపాలక సంఘం అనేక చర్యలు చేపట్టడం జరిగిందని వివరించారు.

పలు శాఖల అధికారులు మాట్లాడుతూ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ద్వారా అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిం దన్నారు. పట్టణంలో ఆత్మగౌరవ దీక్షలను సమర్ధవంతంగా నిర్వహించడం జరుగుతుందని రానున్న కాలంలో కూడా ప్రజలు స్వచ్ఛందంగా ఇదే పద్ధతిలో ముందుకు సాగాలని కోరారు.

పర్యాటకులతో సూర్యలంక కిటకిట



బాపట్ల రూరల్, డిసెంబరు 31 మనంన్యూస్ : ఆదివారం సెలవుదినం 2017కు వీడ్కోలు పలుకుతూ ఆదివారం బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరానికి రాష్ట్రం నాలుదిక్కులనుండి పర్యాటకులు భారీసంఖ్యలో విచ్చేసారు. కుటుంబసభ్యులతో బంధుమి త్రులతో సముద్రస్నానాలు చేసి, ఆనందంగా గడిపారు.తీరంలో కోకో, కబడీ, వాలీబాల్ వంటి ఆటలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. ఆదివారం సెలవుదినం, సోమవారం నూతన సంవత్సరంలో సూర్యలంకకు పెద్దసంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తారాని తెలిసికూ డా పంచాయతీ అధికారులు రెవెన్యూ అధికారులు పర్యాటకులకోసం ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కలిక షేడ్లు నిర్మించకపోవటంతో పర్యాటకులు పలు ఇబ్బందులకు గూరైనారు.

సూర్యలంక ప్రవేశానికి ముందు సైకిల్,ఆటో, బస్సు,లారీల స్టాండ్ నిర్వహకులు రోడ్డుకు అడ్డంగా తాడుకట్టి సూర్యలంకవెళ్ళే వాహనదారు లవద్ద అక్రమంగా డబ్బులు వసూలుచేశారు. ఇలా ప్రతి ఆదివారం చేస్తున్నా సంబంధిత అధికా రులు పట్టించుకోవటంలేదు. సోమవారం నూతనసంవత్సరం కావున సూర్యలంకకు అధిక సంఖ్యలో పర్యాటకులు విచ్చేశారు. కావున ఆర్.టి.సి. డిపో అధికారులు ప్రత్యేకంగా బస్సులు నడపాలని పర్యాటకులు కోరుతున్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి

ఎపిబిజెఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీరాహుస్సేన్ ఖాన్



నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న నందిగామ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎంఎ ఖాజా

నందిగామ, డిసెంబర్ 31, మనంన్యూస్ : 2018 నూతన సంవత్సరంలో విద్యార్ధిని విద్యార్థులు ఒక లక్ష్యంతో చదువులో రాణించాలని, కొత్త సంవత్సరంలో ఆనందంగా ముందుకు సాగి విద్య, క్రీడారంగాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి మీరాహుస్సేన్ ఖాన్, నందిగామ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎంఎ ఖాజా పేర్కొన్నారు. స్థానిక ఎంఆర్ఆర్ ప్రతిభ కాలేజిలో న్యూఇయర్ వేడుకలు ఘణంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిధిలుగా హాజరైన పి మీరాహుస్సేన్‌ఖాన్, ఎంఎ ఖాజాలు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, అనుకున్న పనులు నేరవేరాలని వారు ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ ఖాసిం, కరస్పాండెంట్ ఎండి షేర్‌అలీ, శ్రీనివాసరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

దినఫలం (జనవరి 1)

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1)

ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. దేవాలయాల సందర్శనకు అవకాశం ఉంది. కొత్త సంవత్సరం బాగానే మొదలవుతుంది. ఆదాయం ఆశాజనకంగా ఉంటుంది. ప్రేమ వ్యవహారాలు ఫలిస్తాయి. వినోద కాలక్షేపం చేస్తారు.

వృషభం (కృత్తిక 2, 3, 4, రోహిణి, మృగశిర 1, 2)

ఉద్యోగంలో కొత్త బాధ్యతలు మీద పడతాయి.శని, గురు గ్రహాలు ప్రతికూలంగా ఉండడం వల్ల ప్రతి పనీ ఆలస్యంగా పూర్తవుతుంటుంది.వృత్తి ఉద్యోగాల్లో పరిస్థితులు అనుకూలంగానే ఉంటాయికానీ,ఇంటిపరిస్థితులేప్రతికూలంగా ఉంటాయి.

మిథునం (మృగశిర 3, 4, ఆర్ద్ర, పునర్వసు 1.2. 3)

కొత్త సంవత్సరం బాగానే ప్రారంభం అవుతుంది. సంతానం నుంచి శుభ వార్తలు వింటారు. ప్రేమలు ఫలిస్తాయి. పెళ్లి కుదిరే అవకాశం ఉంది. సమీప బంధువులొకరి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. పనులలో ఆటంకాలు ఎదురవుతాయి.

కర్కాటకం (పునర్వసు 4, పుష్యమి, ఆశ్లేష)

కొత్త సంవత్సరం మిశ్రమ ఫలితాలతో ప్రారంభం అవుతుంది. స్థాన చలనానికి అవకాశం ఉంది. ఆదాయం బాగానే ఉంటుంది. స్నేహితుల మీద డబ్బులు ఖర్చులు చేస్తారు. బంధువులు ముఖం చాటేస్తారు. మీ ఆరోగ్యం నిలకడగానే ఉంటుంది.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1, 2, 3)

కొత్త సంవత్సరం కొన్ని ప్రతికూలతలతో ప్రారంభం అవుతుంది. ఆదాయానికి, ఆరోగ్యానికి లోటు ఉండదు. ఇంటా బయటా ఒత్తిడి పెరుగుతుంది. తోబుట్టువులతో విభేదాలు తలెత్తవచ్చు. విందులు వినోదాల్లో పాల్గొంటారు.

కన్య (ఉత్తర 4, హస్త, చిత్త 1, 2)

కొత్త సంవత్సర ప్రారంభం బాగానే ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది. అయితే ఖర్చులు పెరుగుతాయి. కోర్టు కేసులు పరిష్కారం అవుతాయి. ఉద్యోగంలో పని భారం పెరుగుతుంది. ఇంట్లో ఎవరితోనూ వాదోపవాదాలకు దిగకండి.

తుల (చిత్త 3, 4, స్వాతి, విశాఖ 1, 2, 3)

కొత్త సంవత్సరం ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఇంట్లో పిల్లలతో కాలక్షేపం చేస్తారు. ఇల్లు కొనాలనే ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగంలో బదిలీ సూచనలున్నాయి. బాధ్యతలు పెరుగుతాయి. పెళ్లి సంబంధాలు కుదురుతాయి.

వృశ్చికం (విశాఖ 4, అనూరాధ, జ్యేష్ఠ)

కొత్త సంవత్సరంలో బంధుమిత్రులతో శుభ కార్యాల్లో పాల్గొంటారు. సంతానం నుంచి శుభ వార్తలు వింటారు. ఆదాయానికి మించి ఖర్చు పెరుగుతుంది. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతారు. మానసిక ప్రశాంతత తగ్గుతుంది.

ధనస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1)

కొత్త సంవత్సరం బాగానే ప్రారంభం అవుతుంది. అదనపు ఆదాయం కోసం ప్రయత్నాలు చేస్తారు. బంధుమిత్రుల రాకపోకలు ఎక్కువవుతాయి. ఇల్లు మారే సూచనలున్నాయి. ప్రమోషన్ వచ్చే అవకాశం ఉంది.

మకరం (ఉత్తరాషాఢ 2,3,4, శ్రవణం, ధనిష్ఠ 1,2)

కొత్త ఏడాది బాగానే ప్రారంభం అవుతుంది. నచ్చిన ఉద్యోగానికి మారతారు. ఖర్చులు ఆదాయంతో పోటీపడతాయి. ప్రేమ వ్యవహారాలు బెడిసికొట్టే అవకాశం ఉంది. పిల్లలు చదువుల్లో పురోగతి సాధిస్తారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి.

కుంభం (ధనిష్ఠ 3,4, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3)

కొత్త సంవత్సరం బాగానే అనుకూలంగానే ప్రారంభం అవుతుంది. ఆదాయానికి, ఆరోగ్యానికి ఢోకా ఉండదు. ప్రమోషన్ రావొచ్చు. పెళ్లి బాజాలు మోగుతాయి.

మీనం (పూర్వాభాద్ర 4, ఉత్తరాభాద్ర, రేవతి)

కొత్త సంవత్సరం మిశ్రమ ఫలితాలతో ప్రారంభం అవుతుంది. వ్యాపారం లేదా స్వయం ఉపాధిలో ఉన్నవారికి ఇది అనుకూల సమయం. ఉద్యోగులకు ఆదాయ వ్యయాలు సమానంగా ఉంటాయి. పెళ్లి సంబంధాలు కుదురుతాయి.

హత్యకేసులో నిందితుల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డి.యస్.పి.గంగాధరం, వెనుక నిందితుడు

అలస్యంగా వెలుగుచూసిన కేసులు

బాపట్ల నేరవిభాగం, డిసెంబరు 31 మనం న్యూస్: అక్టోబరులో జరిగిన ఒక వృద్ధురాలి బెదిరింపు డబ్బువసూలుతోపాటు, అదేనెలలో దిపావళి రోజున ఒక సినిమా హాల్‌లో జరిగిన హత్యకేసు సంబంధించి నేరస్తుడిని అరెస్టు చేశామని ఆదివారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో డి.యస్.పి గంగాధరం వెళ్ళడించారు. అలస్యంగా వెలుగుచూసిన ఈ కేసు పూర్వపరాలను అయనవివరిస్తూ చలంచర్ల వెంకయ్య అనే నిందితుడు అక్టోబరు నెలలో ఒక వృద్ధిరాలి ఇంట్లో దూరి ఆమెను చంపుతానని బెదిరించాడు. ఆమెవద్ద రూ.3వేలు నగదు తీసుకొని తెనాలి వెళ్ళాడు. అక్కడ తన స్నేహితుడు నారాయణతో కలిసి, మద్యం సేవించాడు డబ్బులు ఎక్కడివిరా అని నారాయణ అడిగితే ఓ ముసిలిదాన్ని బెదిరించి పట్టుకొచ్చానన్నాడు.ఆ తరువాత ఇద్దరూ కలిసి బాపట్లలో ఒక సినిమా హాలులో స్వీపరులుగా పనిచేస్తున్నా నారాయణ అక్కా, బావలవద్దకు వాచ్చారు. ఆ రోజు దిపావళి పండుగ కావటంతో ఇద్దరూ కలిసి బాగా మద్యంత్రాగారు. ఆ మత్తులో నారాయణ టాక్సీ స్టాండ్‌లోని క్రిష్ణ అనే వ్యక్తితో నిందితుడు వెంకయ్య చేసిన వృద్ధురాలి బెదిరింపు గురించి మాట్లాడాడు. వద్దని వారించి వెంకయ్య నారాయణతో కలిసి రిపేరులోవున్న సినిమా హాలుకు వచ్చారు. అక్కడ నా నేరం గురించి ఇతరులకు ఎందుకు చెప్పావురా అంటూ వాగ్వివాదానికి దిగి అక్కడ వున్న కర్రతో కొట్టి నారాయణను హత్యచేశాడు. మరుసటి రోజు ఉదయం ముద్దాయిఅక్క పోలమ్మ వచ్చి చూస్తే నారాయణ శవం, ప్రక్కన వెంకయ్య నిదరపోతున్నారు. వెంటనే వెంకయ్యను నిదులేపి ఎమైందని అడిగితే నేనే కొట్టి చంపానులే అని వెంకయ్య అక్కడనుంచి వెళ్ళిపోయాడు. ఎంతసేపటికి రాకపోవటంతో పోలమ్మ ఆమె అన్న శ్రీనివాసు,వదిన మల్లీలతో కలిసి నారాయణ శవాన్ని తోపుడుబండిపై పెట్టుకొని మల్లీఖార్జున బృందావనం రోడ్డులోని హిందూ శ్మశానంలో పూడ్చిపెట్టారు. కొన్నాళ్ళకు విషయం పోలీసులకు తెలిస్తే తనను అరెస్టు చేస్తారని, భయపడిన పోలమ్మ వి.ఆర్.ఓవద్ద లొంగిపోయి జరిగిన విషయం వివరించింది.దాంతో డి.యస్.పి. గంగాధర్ పర్యవేక్షణలో సి.ఐ వినయ్ కుమార్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి హత్యకేసులో ప్రధాన ముద్దాయి చలంచర్ల వెంకయ్యను ఆదివారం అరెస్టుచేశారు. చనిపోయిన నారాయణ తెనాలిలో వుంటాడని తెలిసిందేగాని అతని తల్లిదండ్రులు,బంధువులగురించి సమాచారంలేదని, ఆ విషయం గురించి అరాతీస్తున్నమని డి.యస్.పి.వివరించారు. నిందితుడిని సోమవారం కోర్టులో హజరుపరుస్తామన్నారు. ఈ కేసు విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన సి.ఐ. వినయ్‌కుమార్, యస్.ఐ.రవిశంకర్‌రెడ్డి, సిబ్బందిని డి.యస్.పి. గంగాధరం ప్రత్యేకంగా అభినందించారు.

బెల్టుషాపులపై సమరభేరి



సమావేశంలో మాట్లాడుతున్న యం.యల్.ఎ. ముస్తాఫా

అఖిలపక్ష సమావేశంలో నేతల పిలుపు

పొన్నూరు డిసెంబర్ 31 మనం న్యూస్ :రాష్ట్రంలో మద్యం నిర్మూలనపై తొలి సంతకం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా మద్యాన్ని ఏరులై ప్రవహింపచేస్తున్నారని అఖిలపక్ష సమావేశంలో నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం బెల్టు షాపులను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని డిమాండ్‌చేస్తూ ఆదివారం స్థానిక ఐలాండ్ సెంటర్‌లో జరిగిన అఖిలపక్ష ధర్నాలో పలు రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు. వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ జిల్లా యస్.సి. సెల్ నాయకుడు బొనిగల వేణు ప్రసాద్ ఆధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో వై.కా.పా. గుంటూరు 1 యం.యల్.ఎ. మహ్మద్ ముస్తాఫా, మాజీ శాసన సభ్యురాలు మేకతోటి సుచరితా, గుంటూరు పార్లమెంట్ వై.కా.పా. అధ్యక్షుడు, మాజీ శాసన సభ్యులు రావి వెంకటరమణ, జనసేన జిల్లా నాయకుడు తన్నీరు కిషోర్, పొన్నూరు జడ్.పి.టి.సి. సభ్యుడు కోట శ్రీనివాసరావు, బి.జె.పి. నాయకుడు రవికుమార్, అమ్‌ఆద్మి పార్టీ నాయకుడు గాజుల నాగభూషణం, సి.పి.ఐ.యం.యల్. నాయకుడు గోగినేని పరసురామయ్య, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ యన్. రూత్‌రాణి, డాక్టర్ యన్. రవీంద్రనాథ్ రాగూర్, షేక్ తజ్మల్ బేగ్, సూరిశెట్టి శ్రీనివాసరావు, ఆకుల వెంకటేశ్వరరావు, వామపక్షాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు. యం.యల్.ఎ. మహ్మద్ ముస్తాఫా మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో బెల్ట్ షాపుల సృష్టికర్త చంద్రబాబే నన్నారు. దైవం న్యాయనిర్ణేతగా పనిచేసే అన్యాయాన్ని రూపుమాపే కాలం దగ్గర పడిందన్నారు. మాజీ యం.యల్.ఎ. సుచరిత మాట్లాడుతూ ఎన్నో పేద, మధ్య తరగతి కుటుంబాలు మద్యం, బెల్టు షాపులకు బలైపోతున్నాయన్నారు. ఈ విషయంలో ప్రజలను సంరక్షించేందుకు మద్యం మహమ్మారి నుండి వారిని కాపాడేందుకు సమరశంఖారావం పూనక తప్పదన్నారు. పొన్నూరు నియోజక వర్గ సమన్వయ కర్త, మాజీ యం.యల్.ఎ. రావి వెంకటరమణ మాట్లాడుతూ లిక్కర్‌తో ఈ ప్రభుత్వం పేదల రక్తాన్ని పీల్చివేస్తుందన్నారు. ధన దోపిడీలో లిక్కర్‌ను ప్రధాన ఆయుధంగా ఉపయోగించుకొంటుందని విమర్శించారు. ఇకనైనా ప్రజలు నిద్రలేచి అఖిలపక్ష నిర్ణయంతో బెల్టుషాపులపై చేపట్టిన సమరభేరికి మద్దుతు పలకాలని కోరారు. పొన్నూరులో ధర్నాతో శ్రీకారం చుట్టిన ఈ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉవ్వేత్తున విస్తరింపజేసేందుకు కార్యకర్తలు, అభిమానులు, ఆందోళనకారులు సిద్ధంగా వుండాలని కోరారు. బెల్టుషాపుల నిర్వహణ రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఎత్తులో సాగుతుంటే పొన్నూరు నియోజక వర్గం అంతకు రెట్టింపుగా ఆదాయమే ధ్యేయంతో ఇంటింటా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారన్నారు. పొన్నూరు జడ్.పి.టి.సి. సభ్యుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో మద్యం నిర్మూలనపై తొలి సంతకం చేసినప్పటికీ దానిని దిగువ స్థాయి నాయకులు, అధికారులుతూట్లు పొడిచి సమాజానికి గొడ్డలిపెట్టుగా మారారని విమర్శించారు. ఇంకా ఈ ధర్నాలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు వడ్లాణం ప్రసాదరావు, షేక్ సఫాయితుల్లా, పెదకాకాని సర్పంచ్ ఆళ్ళ వీరరాఘవమ్మ తదితరులు పాల్గొన్నారు.

మీడియాకు ఉచిత వైద్యం

పొన్నూరు, డిసెంబరు 31 మనం న్యూస్ : పొన్నూరు నియోజక వర్గంలో వివిధ రకాల పత్రికలు, టి.వి. చానళ్ళలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న మీడియా విలేకరులకు తమ వైద్యశాల నుంచి ఉచిత వైద్యాన్ని అందిస్తామని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ యన్. రూత్‌రాణి, డాక్టర్ యన్. రవీంద్రనాథ్ రాగూర్‌లు హామీయిచ్చారు. శనివారం రాత్రి ఆసుపత్రి ఆవరణలో మీడియా విలేకరులతో ఏర్పాటుచేసిన గెట్‌టుగెదర్ కార్యక్రమానికి డాక్టర్ రూత్‌రాణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు మాజీ శాసన సభ్యుడు, పొన్నూరు నియోజకవర్గ సమన్వయ కర్త రావి వెంకటరమణ మాట్లాడుతూ వాస్తవాన్ని నిస్పక్షపాతంగా వ్యక్తీకరించటంలో మీడియా ఈ సమాజానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు మందపాటి శేషగిరిరావు, పొన్నూరు పాల్గొన్నారు.

ఘనంగా 2018



వినుకొండ, డిసెంబర్ 31, మనం న్యూస్ : స్థానిక గీతాంజలి స్కూల్ ఆవరణలో న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్కూల్ ప్రిన్సిపాల్ టి. కృష్ణవేణి చిన్నారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో ప్రతి ఒక్క విద్యార్థి అన్ని రంగాలలో ఉన్నత స్థాయి చేరుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ప్రతి ఒక్కరి కుటుంబాలలో సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆ భగవంతునికి మనసారా ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నారుల చే న్యూఇయర్ కేక్‌ను కట్ చేయించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ వై.ఎల్. కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గీతమ్స్ ఆధ్వర్యంలో....

పట్టణంలోని గీతమ్స్ పాఠశాల నందు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగులతో ప్రత్యేక రంగవల్లులు ఏర్పాటు చేశారు. 2018 నూతన సంవత్సరం అందరికి శుభాలనను కలుగచేయాలని పాఠశాల కరస్పాండెంట్ ఎం.కోటిరెడ్డి ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రకృతిలో నూతన సంవత్సర చిత్రం

వినుకొండ, డిసెంబర్ 31, మనం న్యూస్ : పట్టణానికి చెందిన చిత్రకారులు ప్రసాద్ గీసిన ప్రకృతిలో నూతన సంవత్సరం పట్టణ ప్రజలను ఆకట్టుకుంటుంది. 2017 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2018 సంవత్సరానికి స్వాగతం పలికే విధంగా గీసిన చిత్రం పట్టణ ప్రజలను ఆకట్టుకుంటుంది. ప్రకృతిలో సంవత్సరం అని ఆ చిత్రానికి ఆయన నామకరణం చేశారు. మనముపొల ముజలము అనే అంశాలను ప్రధానంగా చూపిస్తూ ఆయన గీసిన చిత్రం నూతన సంవత్సరం పాడిపంటలతో సుఖ సంతోషాలతో ప్రజలు వర్ధిల్లాలని ప్రసాద్ ఆకాంక్షించారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెదకూరపాడు, డిసెంబర్ 31 మనం న్యూస్: :: మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలోని శ్రీ వివేకానంద విద్యానికేతన్ లో ఆదివారం 201415 సం. పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా విద్యానికేతన్ డైరెక్టర్ కొల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసేందుకు కృషి చేయాలని అన్నారు. ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి స్కూల్‌కు గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆయన సూచించారు. అనంతరం విద్యానికేతన్ డైరెక్టర్ కొల్లిచంద్రశేఖర్ ను శాల్వలతో , పూల మాలలతో , మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు కొల్లి విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

షార్ట్‌ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ

వినుకొండ, డిసెంబర్ 31, మనం న్యూస్ : ' పిచ్చి కాదల్ ' అనే షార్ట్‌ఫిల్మ్ ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆదివారం సినీ దర్శకులు సత్య ఆదివారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ షార్ట్ ఫిల్మ్‌కి మంచి ఆదరణ ఉందని, ఏదైన విషయాన్ని షార్ట్ ఫిల్మ్ ద్వారా సమాజానికి చేరవేయనున్నట్లు తెలిపారు. ఈ ' పిచ్చి కాదల్ ' షార్ట్ ఫిల్మ్ మంచి కథ అని తెలిపారు. దర్శక నిర్మాత అబ్దుల్ కరీమ్ మాట్లాడుతూ ఒక తమిళ అమ్మాయి, ఒక తెలుగు అబ్బాయి మధ్య జరిగే ఒక విభిన్నమైన ప్రేమ కథా చిత్రమని, మంచి సందేశాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సత్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్ధమాన నటుడు కోటి, జాని, హమిద్, శ్రీ చౌదరి, దాస్, తదితరులు పాల్గొన్నారు.



షార్ట్‌ఫిల్మ్ చిత్రం యూనిట్

విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్

వినుకొండ, డిసెంబర్ 31, మనం న్యూస్ : గంగినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైతన్య విద్యా సంస్థల ఏజిఎం డి. శ్రీనివాసరావు పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గంగినేని రాఘవ మాట్లాడుతూ స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సా హకాలు అందిం చటం జరుగుతుందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇటువంటి పోటీ పరీక్షలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఈ పరీక్షకు సుమారు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త గంగినేని రామయ్య, వై.ఎల్.కిషోర్, భాస్కర్ రెడ్డి, సుభాని, శ్రీనివాసరావు, పలు విద్యా సంస్థల డైరెక్టర్లు పాల్గొన్నారు.

మస్జీద్ నిర్మాణానికి శంకుస్థాపన



వినుకొండ, డిసెంబర్ 31, మనం న్యూస్ : పట్టణంలోని కుమ్మరి బజార్ నందు మర్కస్ మస్జీద్ నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే జీ.వి. ఆంజనేయులు, నియోజకవర్గ వైసిపి కన్వీనర్ బొల్లా బ్రహ్మనాయుడు, సిపిఐ ముప్పాళ్ల నాగేశ్వరరావు, హుడా సొసైటి ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాన్ సాహెబ్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మసీదును భారీ ఎత్తున నిర్మాణం చేయటం, పెద్దలందరూ ఐక్య కార్యాచరణతో ముందుకు రావటం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఇస్లాం అంటే శాంతికి ప్రతీక అని తెలిపారు. నూతన సంవత్సరం పాడిపంటలతో వర్ధిల్లాలని అల్లాని ప్రార్థించారు. కార్యక్రమంలో ఎం.ఎస్.కె.బాషా, గౌస్‌బాషా, నరరాలశెట్టి శ్రీనివాసరావు, పిఎస్.ఖాన్, షరీఫ్, సుభాని, ఇమాంసా, ఎంఎస్. బాబు, గోనుగుంట్ల హనుమయ్య, మూలే వెంకటేశ్వరరెడ్డి, దండు చెన్నయ్య, గంధం బాలిరెడ్డి, చిన్నబ్బాయి, ఎం. కోటయ్య, నాసరరెడ్డి, గురవయ్య, వెంకట్రావు, వెంకటరెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ వివాహ పరిచయవేదిక



వినుకొండ, డిసెంబర్ 31, మనం న్యూస్ : బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో భవిష్యత్తులో పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సంఘం అధ్యక్షులు పివి.సురేష్ బాబు అన్నారు. పట్టణంలోని సాయిబాబా దేవస్థానం నందు ఆదివారం నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వివాహ పరిచయవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు పి.వి.సురేష్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వివాహ వేదిక ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. సంఘం ద్వారా పలు రకాల సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బొగ్గరం బాచి, గాలి శ్రీనివాసరావు, చంద్రబాబు, మాధవరావు, శ్రీ కృష్ణయ్య, వై. శ్రీనివాసశర్మ, శివ, శేషు, శేఖర్, సుబ్బారావు, హనుమంతురావు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

శాంతి ఆశ్రమ ట్రస్టు సేవల అభినందనీయం

వినుకొండ, డిసెంబర్ 31, మనం న్యూస్ :శాంతి ఆశ్రమ ట్రస్టు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయం అని ఎమ్మెల్యే జీ.వి. ఆంజనేయులు అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో హిమాలయ గురుదేవుల ఆశీస్సులతో 2018 నూతన సంవత్సర డైరీలను నియోజకవర్గ శాసన సభ్యులు జీ.వి. ఆంజనేయులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీ.వి. ఆంజనేయులు మాట్లాడుతూ గత 3 సంవత్సరాల నుండి పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం, సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ట్రస్టుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జి.ఈశ్వరరావు, జి.విశ్వనాథం, పి.మోహన్‌రావు, కె.కోటేశ్వరరావు, పి.శ్రీను, వై. లెనిన్‌బాబు, పి.ఆంజనేయులు, ఎన్. పాపారావు, ట్రస్టు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయానికి చిరునామా ఏపీ



వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం చంద్రబాబు

గుంటూరు, డిసెంబరు31, మనం ప్రతినిధి: నేడు రసాయన ఎరువుల వాడకం పెరిగిన దృష్ట్యా, ప్రకృతి వ్యవసాయానికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. ఆదివారం నాగార్జున యూనివర్సిటీ ఎదురు బైబిల్ మిషన్ ప్రాంగణంలో వ్యవసాయ శాస్త్రవేత్త పద్మశ్రీ సుభాష్ పాలేకర్ నేతృత్వంలో జరగనున్న ''ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ'' కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈశిక్షణ కార్యక్రమం జనవరి 8వ తేదీ వరకు కొనసాగుతుంది. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 2018 సంవత్సరాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రకృతి సేద్య సంవత్సరంగా నామకరణం చేస్తున్నామన్నారు. వ్యవసాయ పద్ధతిలో పాత పద్ధతులకు స్వస్తి చెప్పి ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేయాలన్నారు. ఒకప్పుడు ప్రకృతి వ్యవసాయమే ఉండేదన్నారు. కానీ రాను రాను ఆదాయం ఎక్కువ కావాలనే ఉద్దేశంతో ఎరువులు అధికంగా వేసి పంటలు పండిస్తున్నారన్నారు. మన శరీరం బాగుంటే ఏపనినైనా సునాయాసంగా చేయొచ్చు. అలానే భూమి కూడా శక్తివంతంగా ఉంటేనే ఏపంటనైనా పండించవచ్చన్నారు. ఆశాజ్యోతి, వెలుగురేఖగా సుభాష్ పాలేకర్‌ను ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఈ 9రోజుల్లో చాలా విషయాలు నేర్పిస్తారని రైతులకు సూచించారు. ప్రపంచంలో ఐటీ రంగంలో ప్రతి నలుగురిలో మన భారతీయులు ఒకరు ఉండటం విశేషమన్నారు.

ఫైబర్ గ్రిడ్ ద్వారా నెలకు రూ. 149 లకే ఇంటర్నెట్, వైఫై, ఇతర సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. నిన్నటి వరకు టెక్నాలజీకి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్ ఉండేదని.... మరికొన్ని సంవత్సరాల్లో ప్రకృతి వ్యవసాయానికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను నిలపాలన్నారు. 1, 50,000 ఎకరాల్లో పైసా పెట్టుబడి లేకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. నేడు వైద్యానికి చాలా మంది ఎక్కువ డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రపంచమండా డిమాండ్ ఉంది. ఇది సక్రమంగా జరిగితే ఇంతకన్నా మరొకటి లేదాన్నారు. దీన్ని వరల్డ్ ఆగ్రో ఫారెస్ట్ వారందరూ గుర్తించారన్నారు. పెట్టుబడులు తగ్గాలంటే ప్రకృతి వ్యవసాయం తప్ప మరొక మార్గం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిగా ప్రకృతి వ్యవసాయంగా మార్చడమే లక్ష్యమన్నారు. పాలేకర్ మాట విని గత 2 సంవత్సరాల్లో ఎన్నో లాభాలు పొందామన్నారు. డిసెంబరు 31, జనవరి 1 ఈరెండింటినీ వదులుకుని ప్రకృతి వ్యవసాయ శిక్షణకు వచ్చిన రైతులందరికీ అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా అందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యేలు దూళిపాళ్ల నరేంద్రకుమార్, రావెల కిషోర్‌బాబు, రిటైర్డ్ ఐఏఎస్ టి. విజయ్‌కుమార్, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి, జెఆర్ పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతికి ప్రకృతి ఆహారోత్పత్తులతో విందు

ఆర్థిక సంఘ 100వ సమావేశాలకు హాజరైన రాష్ట్రపతికి ప్రకృతి వ్యవసాయంతో పండించిన వాటితో భోజనం ఏర్పాటు చేశాం. భోజనం తిన్న తర్వాత చాలా బాగుంది అన్నారు. తర్వాత చెప్పాం.... మీకు వడ్డించిన భోజనం ప్రకృతి వ్యవసాయంతో పండించిన వాటితో చేశామన్నాం. అందుకు రాష్ట్రపతి ఆశ్చర్యపోయి, ఆనందించారు. అలానే ఇలాంటి వాటితోనే ఆహారం తీసుకుంటే మామూలుగా జీవించే దానికంటే 30 సంవత్సరాలు ఎక్కువగా జీవిస్తామన్నారు.

ఒక్క ఆవుతో 30 ఎకరాల సాగు



మాట్లాడుతున్నసుభాష్ పాలేకర్

ప్రకృతి సేద్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంచి ప్రోత్సాహం అందిస్తున్నారని ప్రకృతి వ్యవసాయ పితామహుడు సుభాష్ పాలేకర్ ఆకాంక్షించారు. ఆదివారం నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురు బైబిల్ మిషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పాలేకర్ మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయంతో అందరికీ నష్టమేనన్నారు. ఒక ఆవుతో 30ఎకరాలు సాగు చేయొచ్చని పేర్కొన్నారు. సహజ వ్యవసాయం చేసేవారెవరూ ఆత్మహత్య చేసుకోలేదన్నారు. ప్రకృతి సేద్యంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, సహజ వ్యవసాయంతో రైతులందరికీ లబ్ధి చేకూరుతుందన్నారు. ఈశిక్షణకు సుమారు 6వేల మంది రైతులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి 500 మంది రైతులు పాల్గొన్నారు.



సిఎం రిలీఫ్‌ఫండ్ అందచేస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నూతన సంవత్సరం అందరికీ మేలు జరగాలి

నందిగామ, డిసెంబర్ 31, మనంన్యూస్: నూతన సంవత్సరంలో ప్రతిఒక్కరికీ మేలు జరగాలని నందిగామ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, ప్రతి ఒక్క లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందచేసేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామ శివారు మామిడితోటలో జరిగిన విలేఖరుల ఇష్టాగోష్టి కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే విలేఖరులు చర్చించారు. ప్రధానంగా జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు కేటాయించాలని పలువురు జర్నలిస్ట్‌లు కోరారు. ఎమ్మెల్యే సౌమ్య స్పందిస్తూ జర్నలిస్ట్‌లకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని లబ్ధిదారులందరికీ రేషన్‌కార్డులు, ఫెన్షన్లు, అందించేందుకు అధికారులు సక్రమంగా పని చేయాలని కోరారు. నియోజకవర్గంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి పెద్దఎత్తున తీసుకువెళ్ళాలని అన్నారు.

నియోజకవర్గంలోని సమస్యలు ప్రణాళికాబద్ధంగా ప్రాధన్యతాక్రమంలో నెరవేర్చడం జరుగుతుందని ఎమ్మెల్యే సౌమ్య తెలిపారు. రానున్న జన్మభూమిలో అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాల కోసం అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం చందర్లపాడు మండలం గుడిమెట్ల గ్రామానికి చెందిన బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాధితుడు కార్ల దాసుకు రూ.8లక్షలు సిఎం రిలీఫ్ పండ్ మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే సౌమ్య బాధితుడికి అందచేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోట వీరబాబు, జిల్లా గ్రంధాలయ సంస్థ డైరెక్టర్ రాటకొండ కోటేశ్వరరావు, నందిగామ మార్కెట్ యార్డు ఛైర్మన్ చిరుమామిళ్ళ శ్రీనివాసరావు(బుజ్జి), కంచికచర్ల మార్కెట్ యార్డు ఛైర్మన్ నన్నపనేని లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు కోగంటి బాబు, వాసిరెడ్డి ప్రసాద్, ఎంపిపిలు వేల్పుల ప్రశాంతి, పాటిబండ్ల జైపాల్, నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ వైవి పద్మావతి, నీటి సంఘం అధ్యక్షులు నెలకుదిటి నాగేశ్వరరావు, చందర్లపాడు మండల టిడిపి అధ్యక్షులు మేకల సుధాకర్ బాబు, కో ఆప్షన్ సభ్యులు ఎంఎ ఖాజా, నందిగామ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ కొత్తా సాంబశివరావు, నందిగామ సూపర్‌బజారు అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రాటకొండ మల్లిఖార్జునరావు, జర్నలిస్టులు పి మీరాహుస్సేన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాపై చలి పంజా

- వ్యాధులు సోకి చనిపోతున్న రొయ్యలు
- ఆందోళనలో రైతులు

బాపట్ల డిసెంబరు 31 (మనంన్యూస్ ప్రతినిధి): చలిపులి పంజా విసరటంతో ఆక్వా రైతుల్లో ఆందోళన మొదలైంది. రాత్రి వేళల్లో సాధారణ ఉష్ణోగ్రత కంటే 4,5 శాతం తక్కువగా నమోదు కావడం, పగటి ఉష్ణోగ్రతలు కూడా అనుకూలంగా లేకపోవటంతో రొయ్యల్లో శ్వాసకోశవ్యాధుల ఎక్కువగా వస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏరియేటర్స్ ఎంత సాగించినప్పటికీ చెరువుల్లో ఉష్ణంకలగకపోవటంతో రైతులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. పక్షం రోజుల క్రితం వరకు రొయ్యల పెరుగుదల ఆశాజనకంగా ఉంది. శీతాకాలం ప్రారంభంతోనే చలి ఎక్కువగా ఉండటంతో తీవ్ర ఇబ్బందికరమైన పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం ఈ సిజన్‌లో రొయ్యల సాగు లాభాల బాటలో ఉండటంతో అధిక శాతం రైతులు మొగ్గ చూపారు. బాపట్ల నియోజక వర్గంలో సుమారు 9 వేల ఎకరాల్లోరైతులు ఆక్వాసాగు చేస్తున్నారు. రెండు నెలల క్రితం చెరువులు మొత్తం పట్టి మరల పిల్లవేశారు. ప్రస్తుతం చెరువులన్నీ 70 నుంచి 80కౌంట్ దశలో ఉన్నాయి. వాతావరణం అనుకూలిస్తే మరో నెలరోజుల్లో 25 నుంచి 30 కౌంట్‌కు చేరుకునే అవకాశం ఉండేదని, ఇటీవల చలికి రొయ్యలకు కొత్తకొత్త వ్యాధులొచ్చి మొత్తం చనిపోతున్నాయని ఆక్వారైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సోకుతున్న వ్యాధులివే: ప్రస్తుతం వెన్నామి రకం రొయ్యల పిల్లలను అధికంగా వాడుతున్నారు. చలికారణంగాసరిపడగాలి అందకపోవడంతో రొయ్యల పెరుగుదల పూర్తిగా పడిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే రొయ్యలు అసలు ఫీడింగ్ తీసుకోవడంలేదు. అంతే కాకుండా నీటి కాలుష్య వల్ల వైట్‌స్పాట్, ఇబ్రియో,గిల్సు, ఫంగస్ లూసెట్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, రైతులు వాపోతున్నారు. ఈ వ్యాధులు సోకిన రోయ్యలకు మందలు లేదని, చెరుఉవలో ఒక్క రొయ్యకి వ్యాధిసోకినా చెరువు మొత్తం పూర్తిగా వ్యాపిస్తుందంటున్నారు.